తవ్వి వదిలేశారు..!

- ఇష్టారాజ్యంగా కంకర, మట్టి, గుట్టల తవ్వకాలు
- లోయలు, కుంటలను తలపిస్తున్న క్వారీ గుంతలు
- తరచూ ప్రమాదాలు.. నిండు ప్రాణాలు బలి
- తాజాగా అంకిరెడ్డిపల్లి క్వారీ గుంతలో పడి విద్యార్థి మృతి
- నగర శివారుల్లో 110 క్వారీలున్నా.. అనధికారివే ఎక్కువ



అంకిరెడ్డిపల్లిలో తవ్వకాలు పూర్తయి లోయగా మారిన కంకర క్వారీ

సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారుల్లో క్వారీ గుంతలు తవ్వి పూడ్చకపోవడంతో అవి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. నిబంధనల ప్రకారం తవ్వకాలు పూర్తయిన వెంటనే అక్కడి గుంతలను మట్టితో పూడ్చాల్సి ఉంటుంది. కానీ వాటిని పట్టించుకోవాల్సిన భూగర్భగనుల శాఖ ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో అమలుకు నోచుకోవడం లేదు. ఫలితంగా క్వారీ గుంతల్లో తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం కీసర మండలం అంకిరెడ్డిపల్లిలోని క్రషర్ క్వారీ వద్ద స్నేహితుడు బర్త్ డే సందర్భంగా ఫొటోలు దిగేందుకు వెళ్లిన ఇంటర్ విద్యార్థి అభినవ్ ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడిపోయి మృతి చెందారు. ఇవే గాకుండా నగర శివారుల్లో చాలా క్వారీలను ఇలాగే వదిలేయడంతో అవి లోయలు, కుంటలను తలపిస్తున్నాయి. బస్తీలు, పల్లెలకు సమీపంతో పాటు రోడ్లకు పక్కనున్న క్వారీల గుంతలతో తరచుగా ప్రమాదాలు సంభవించడంతో పాటు ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. 2 ఎకరాల విస్తీర్ణంలోని పదుల మీటర్ల లోతులో ఉన్న గుంతలు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. దీంతో చుట్టు పక్కల పల్లెలు, బస్తీ ప్రజలు ఈ ప్రాంతాల్లో నివసించాలంటేనే భయపడుతున్నారు. దుండిగల్, కీసర, ఘట్‌కేసర్, శామీర్‌పేట, మేడ్చల్, మేడిపల్లి మండలాల పరిధిలోని కంకర క్వారీల్లోనూ గతంలో ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీలు క్వారీ గుంతల్లో పడి మృతి చెందిన ఘటనలూ కూడా ఉన్నాయి. క్వారీ గుంతల్లో జరిగే ప్రమాదాలు పోలీస్‌స్టేషన్లలో కేసు నమోదైతే తప్ప బయటపడడం లేదు. బయట పడని ప్రమాదాలు కూడా అనేకం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదేగాకుండా క్వారీల్లో నిల్వ నీరు ఆకుపచ్చ రంగులోకి మారి జల కాలుష్యం జరిగి పక్కనున్న గ్రామాలు, బస్తీల ప్రజలు కూడా అనారోగ్యం బారిన పడుతున్నారు.

గుట్టలు మాయం


నగర శివారుల్లో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కొండల (గుట్టల) ఆనవాళ్లు లేకుండాపోతున్నాయి. గుట్టలన్నీ కరిగిస్తూ వచ్చిన మాఫియా కన్ను ఇప్పుడు మట్టి రవాణాపై పడుతోంది. రేయింబవళ్లూ మట్టిని తవ్వి.. తరలిస్తూ రూ. లక్షల్లో సంపాదిస్తున్నారు. పొక్లెయిన్లతో తవ్వకాలు చేస్తూ.. టిప్పర్ల ద్వారా తరలిస్తూ గుట్టల ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. మట్టిని రవాణా చేస్తున్న వ్యక్తులకు పలువురి రాజకీయ నేతలు అండదండలు ఉండడంతో సంబంధిత అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రకృతి వనరులు ధ్వంసమవడమే కాకుండా వ్యాపారులు రూ. లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. మరోవైపు మైనింగ్ శాఖకు రాయల్టీ రూపంలో రావాల్సిన డబ్బులు కూడా రాకుండా పోతోంది.

మట్టి రవాణా చేయాలంటే..

మట్టి రవాణా చేయాలంటే.. నిబంధనల ప్రకారం మొదట మైనింగ్ శాఖ ఏడీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటోంది. వారు దరఖాస్తు పరిశీలనకు రెవెన్యూశాఖకు పంపిస్తోంది. అక్కడి నుంచి ఎన్వోసీ వచ్చిన తరువాత మళ్లీ దరఖాస్తును మైనింగ్ శాఖకు నివేదిస్తారు. మైనింగ్ శాఖ సిబ్బంది మళ్లీ క్షేత్రస్థాయికి వెళ్లి మట్టి రవాణాకు అనుకూలమా లేదా పరిశీలించి అనుమతి ఇవ్వాల్సి ఉంటోంది.

పర్యావరణానికి దెబ్బ

కంకర తవ్వకాలతో గుట్టలన్నీ మాయమవడంతో పర్యావరణకు ప్రమాదం ముంచుకువస్తోంది. లీజు పేరిట సాగుతున్న అక్రమ దందాలో నిబంధనల ఉల్లంఘనలే కనిపిస్తున్నాయి. గ్రామ, పట్టణ రెవెన్యూ పరిధిలో పట్టా భూము లున్న రైతుల దగ్గర లీజు అగ్రిమెంట్లు చేసుకోవడం, మైనింగ్ శాఖ నుంచి తవ్వకాలకు అనుమతులు పొంది కంకర తరలించడం ఏళ్లుగా సాగుతోంది. ప్రభుత్వ భూములను లీజు తీసుకుని క్వారీ నడిపిన కాంట్రాక్టర్లు పనులు పూర్తి కాగానే.. రెవెన్యూ శాఖకు అప్పగించడంతో.. వాటికి రక్షణ కంచెలు వేయకుండానే వదిలి పెడుతున్నారు. గాజుల రామారం, కుత్బుల్లాపూర్, రాంపల్లి ప్రాంతాల్లో క్వారీ పనులు పూర్తయిన తర్వాత ఆ గుంతలను చెత్తతో నింపగా, అవి డంపింగ్ యార్డులను మరిపిస్తున్నాయి. నిజాంపేట, మౌలాలీ, అంకిరెడ్డిపల్లి, పోచారం, కీసర ప్రాంతాల్లోని క్వారీల గుంతలు పచ్చని నీటితో కుంటలను తలపిస్తున్నాయి. ప్రైవేట్ భూములను లీజుకు తీసుకుని క్వారీలు నడిపిన కాంట్రాక్టర్లు కూడా వాటిని గాలికి వదిలి వేస్తున్నారు.



పోచారంలో తవ్వకాలు పూర్తయి లోయగా మారిన కంకర క్వారీ

శివార్లల్లో అనధికార క్వారీలే ఎక్కువ..

నగర శివారుల్లో అధికారికంగా 110 క్వారీలు ఉండగా, అనాధికారికంగా రెటింపు స్థాయిలో నడుస్తున్నట్లు తెలుస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని కీసర, మేడ్చల్, శామీర్‌పేట, ఘట్‌కేసర్ మండలాల పరిధిలో 36 క్వారీలు నడుస్తుండగా, రంగారెడ్డి జిల్లా పరిధిలో 74 క్వారీలు కొనసాగుతున్నాయి. లీజు పేరిట ఏళ్ల తరబడి కంకర తవ్వకాలు చేపట్టి రూ. లక్షలు కూడబెట్టుకున్న వ్యాపారులు నిబంధనలకు నీళ్ల వదులుతున్నారు. దీంతో లీజు పూర్తయిన క్వారీలన్నీ పెద్ద గుంతలు, లోయలుగా మారి ప్రమాదాలకు నిలయాలవుతున్నాయి.

ముగిసిన శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు



పౌరాణిక పద్య నాటక ప్రదర్శన

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ హనుమాన్‌పేట సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీహాలులో గత ఐదు రోజుల నుండి జరుగుతున్న శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం



బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఈటల రాజేందర్ తదితరులు

మల్లాపూర్: నాచారంలో ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన నాచారం డివిజన్ బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయాన్ని ఆదివారం సాయంత్రం బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రారంభించారు. అనంతరం పలువురు యువ నాయకులు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా మోర్చా అధ్యక్షురాలిగా బండి పద్మ



నియామక పత్రాన్ని అందుకున్న బండి పద్మ

రామంతపూర్: మేడ్చల్ మల్కాజగిరి జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రామంతపూర్‌కు చెందిన బండి పద్మ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం మహిళా మోర్చా విభాగం జారీ చేసిన నియామక పత్రాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌తో కలిసి కార్పొరేటర్ బండారు శ్రీవాణి ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ.. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన కన్వీనర్ మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకురాలు గీతారెడ్డి, మంగమ్మ, ప్రేమలత, వీణ తదితరులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ ఆలయ హుండీల చోరీ

రామంతపూర్: జాతీయ రహదారి దగ్గర పెద్ద చెరువు కట్టపై ఉన్న శ్రీకట్ట మైసమ్మ ఆలయంలో మూడు హుండీలు ఆదివారం వేకువ జామున చోరీకి గురైనట్లు ఆలయ చైర్మన్ బండారి వెంకట్రావు తెలిపారు. భక్తులు హుండీలో వేసే కానుకలను, డబ్బులను ప్రతి మూడు నెలలకు ఒకసారి లెక్కిస్తామని తెలిపారు. సుమారు రూ. 70 వేలు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. మంగళవారం నుండి కట్ట మైసమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తుండగా ఈ సంఘటన జరగడంతో దిగ్భ్రాంతికి గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

భర్తతో గొడవపడి గర్భిణి అదృశ్యం

ఉప్పల్: భర్తతో గొడవ పడి ఓ గర్భిణీ అదృశ్యమైంది. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. రామంతాపూర్ వెంకటరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన సాయి పవన్, అనుష(26)లకు సంవత్సరం క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం అనుష అరు నెలల గర్భిణి. పుట్టింటికి వెళతానని భర్తతో చెప్పగా భర్త అందుకు అంగీకరించలేదు. దీంతో భర్త బయటకు వెల్లగా ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. పుట్టింటికి కూడా వెళ్లలేదు. దీంతో అనుష తండ్రి ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

భార్యతో గొడవ పడి భర్త అదృశ్యం

రామంతాపూర్ అర్టీసీ కాలనీకి చెందిన లక్ష్మణ్ (36), భార్య కవితలు ఈ నెల 18 న గొడవపడ్డారు.దీంతో కవిత పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి 20 న ఇంటికి రావడంతో అప్పటికే భర్త ఇంట్లోలేడు. ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. దీంతో కవిత ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఉద్యోగం రాలేదని యువతి ఆత్మహత్య

ఉప్పల్: ఉద్యోగం రాలేదని నిరుద్యోగ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. సాయిరాంనగర్ ప్రాంతానికి చెందిన బండపల్లి ఎల్లబాయి కూతురు, అల్లుడు చని పోవడంతో వారి ఇద్దరు కూతుళ్ల సాత్విక(22), బావిష్క (16)లను తానే పోషిస్తుంది. సాత్విక గత కొద్ది రోజులుగా ఉద్యోగాన్వేషణలోఉంది. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం రాక పోవడంతో మనస్థాపం చెంది శనివారం రాత్రి ఇంట్లోని గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అమ్మమ్మ ఎల్లబాయి పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

మల్కాజిగిరికి ఐటీ టవర్స్ తీసుకొస్తా

ఈటల రాజేందర్

కాప్రా: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మల్కాజిగిరికి ఐటీ టవర్స్ తీసుకొచ్చి, పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. శనివారం రాత్రి కాప్రా డివిజన్‌లో పర్యటించిన ఈటల సాయిబాబా నగర్, సాయిరాంనగర్ మీదుగా రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇప్పటికీ కొన్ని కాలనీల్లో రోడ్లు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తనను గెలిపిస్తే ప్రజల సమస్యలు తీరుస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉండొచ్చు కానీ దేశంలో మాత్రం ఆ పార్టీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం కల అంటూ ఎద్దేవా చేశారు. మరోసారి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తుందని, రేవంత్ రెడ్డివన్నీ దొంగ హామీలేనని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని సాకు చెబుతూ హామీలను అటకెక్కించే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, భేతి సుభాష్ రెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, కాప్రా డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆదరణే కాంగ్రెస్‌ను గెలిపిస్తుంది



భరత్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి



రామంతాపూర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కుషాయిగూడ: ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తుందని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. ఆదివారం కాంగ్రెస్ మల్కాజిగిరి లోకసభ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డికి మద్దతుగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి నాయకులు గడ్డం యాదగిరి, సీతరాంరెడ్డి పాల్గొన్నారు.

బస్తీలు, కాలనీల్లో కాంగ్రెస్ ప్రచారం

రామంతపూర్: డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలు, కాలనీల్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ రామంతపూర్ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ రఫిక్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు విస్తృతంగా పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ ఇంచార్జి తెలుగు కలర్ మోహన్‌రెడ్డి, వల్ల శ్రీకాంత్ యాదవ్, సందీప్, గరిక సుధాకర్, ముత్యాల బాబు, సతీష్ గౌడ్, నామ్ రాజిరెడ్డి, లింగం, జంగయ్య, భాస్కర్, జిల్లు తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో కాంగ్రెస్ నేతల ప్రచారం

అల్వాల్: కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు అల్వాల్‌లోని శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్, కాంగ్రెస్ అల్వాల్ సర్కిల్ అధ్యక్షులు అశోక్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ఉదయ్ పాల్గొన్నారు.

హిల్‌టాప్ కాలనీలో ప్రచారం

గౌతంనగర్: మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతమహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మల్కాజిగిరి నియోజకవర్గ బీ–బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో గౌతంనగర్ డివిజన్ హిల్‌టాప్ కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి సునీతమహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ మానవ హక్కుల సంఘం నూతన కార్యవర్గం



జాతీయ మానవ హక్కుల సంఘం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నూతన కార్యవర్గం

అల్వాల్: జాతీయ మానవ హక్కుల సంఘం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నూతన కార్యవర్గాన్ని సంఘం అధ్యక్షులు ఎంయు దువా ఆధ్వర్యంలో నియమించారు. అధ్యక్షుడిగా (చీఫ్) డాక్టర్ ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా రితీష్ రాజ్, సంయుక్త కార్యదర్శులుగా గజానంద్, రాజ్‌కుమార్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా మరుపల్లి రాహుల్, ప్రెస్ కార్యదర్శిగా నరేందర్‌సింగ్, ఆఫీసర్ అధికారిగా దుర్గాప్రసాద్, నిహారిక, రిపోర్టింగ్ అధికారిగా అభిలాష్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా హరీష్, శ్రీకృష్ణ, శరణ్‌కుమార్‌లను నియమించగా ప్రధాన పోషకుడిగా అడ్వకేట్ ఏఎస్.రావు, ముఖ్య సలహాదారుడుగా నర్సింగ్‌రాజ్, న్యాయ సలహాదారులుగా కరుణాకర్‌లు వ్యవహరిస్తారు.

గాడవెల్లిలో మైసమ్మ బోనాలు



గౌడవెల్లి మైసమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామస్తులు ఆదివారం మైసమ్మ బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు.మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మాజీ ఎంపీపీ పద్మ జగన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రాజు, నాయకులు మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, రందీప్‌రెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి, గోమారం శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్‌భాను, సింహాల్ యాదవ్ తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.


‘దళితులను అవమానిస్తే బుద్ధి చెబుతాం’



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న సాయిన్నమాదిగ, కృష్ణమాదిగ

ఘట్‌కేసర్: దళితులను అవమానిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని తెలంగాణ మాదిగ జేఏసీ నాయకులు టీఎండీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయన్న మాదిగి, మాదిగ జేఏసీ అధికార ప్రతినిధి ఎర్రవెల్లి కృష్ణమాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు అంజయ్యమాదిగ హెచ్చరించారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో దళిత సీనియర్ నాయకుడు రాపోలు రాములను కాంగ్రెస్ పార్టీ, నియోజకవర్గ, జిల్లా నాయకులు అవమాన పరుస్తున్నారన్నారు. బోడుప్పల్ ఎంపీటీసీగా, 1994లో బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్‌కు గట్టి పోటీ ఇచ్చారని గుర్తు చేశారు. దళిత నాయకుడికి సముచిత స్థానం ఇవ్వాలని లేకుంటే పార్లమెంట్ ఎన్నికల్లో తడాఖా చూపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్సింగ్‌రావు, సతీశ్‌మాదిగ, లక్ష్మణ్ తదతరులు పాల్గొన్నారు.

నాగేశ్వర్‌రావుకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ విభాగం నుంచి జిల్లపల్లి నాగేశ్వర్‌రావు పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. సీనియర్ అధ్యాపకులు ప్రొ.వీబీ నరసింహా పర్యవేక్షణలో ఇంప్లిమెంటేషన్ ఆఫ్ డీప్ లెర్నింగ్ అండ్ కంప్రెషన్ టెక్నిక్స్ ఆన్ హెల్త్ కేర్ సిస్టం ఫర్ ఇంప్రూవ్ డేటా స్టోరేజ్ ఎఫీషెన్సీ అనే అంశం పై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



వేడుకలను ప్రారంభిస్తున్న చెస్ క్రీడాకారిణి హరిక, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు



విద్యార్థుల నృత్యరూపకం

కుషాయిగూడ: విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా సాధన చేయాలని ప్రముఖ చెస్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక అన్నారు. కుషాయిగూడలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, పాఠశాల చైర్మన్ జగన్మోహన్‌రావుతో కలిసి ప్రారంభించారు. చదువుతో పాటుగా విద్యార్థుల అభిరుచులకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలన్నారు. అప్పుడే వారి లక్ష్యాయాలకు చేరువవుతారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సమష్టి కృషితోనే సమస్యల పరిష్కారం



లోకల్ మేనిఫేస్టోను ఆవిష్కరిస్తున్న స్థానిక నాయకులు

అల్వాల్: సమష్టి కృషితోనే సమస్యలు పరిష్కారమవుతాయని నార్త్ అల్వాల్ సిటీ ప్రతినిధులు అన్నారు. ఆదివారం హెచ్‌ఎంటీ కాలనీలోని బతుకమ్మ పార్కులో కాలనీల అసోసియేషన్ల ప్రతినిధి బృందం తమ సమస్యలను లోకల్ మేనిఫెస్టో రూపంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అల్వాల్ ఉత్తరాన ఉన్న 20 కాలనీలు సమూహంగా ఏర్పడి నార్త్ అల్వాల్ సిటీగా పేరు పెట్టుకున్నామన్నారు. నార్త్ సిటీకి సంబంధించిన 13 సమస్యలను ఈ లోకల్ మేనిఫెస్టోలో పొందుపర్చామన్నారు. ప్రధానంగా డ్రైనేజీ, అధ్వాన్నంగా ఉన్న రోడ్లు గుర్తించామని, లోక్‌సభ ఎన్నికల ప్రచార నిమిత్తం వచ్చే రాజకీయ నాయకులకు ఈ లోకల్ మేనిఫెస్టోను ఇవ్వాలని నిర్ణయించుకున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీల అధ్యక్షులు వి.మహేందర్‌రెడ్డి, జి.మహేందర్‌రెడ్డి, రాకేష్‌రావు, భూపాల్ రెడ్డి, మల్లారెడ్డి, చంద్రం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల వినూత్న ప్రచారం



ఉప్పల్ మార్కెట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న రాగిడి రజిని, బీఆర్ఎస్ నేతలు

ఉప్పల్: మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం ఆయన సతీమణి రాగిడి రజిని, ఉప్పల్ బీఆర్ఎస్ నాయకులు ఆకుల మహేందర్ ఆధ్వర్యంలో ఉప్పల్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉప్పల్ కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తూ, పూలమ్ముతూ, చేపలను విక్రయిస్తూ వినూత్న పద్ధతిలో ప్రచారం నిర్వహించారు. గత 25 సంవత్సరాలుగా ఇక్కడి ప్రజలకు నిర్విరామంగా సేవలు చేసిన రాగిడి లక్ష్మారెడ్డిని బారి మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేసారు.

ఎన్నికల సన్నాహక సమావేశం

చిలుకానగర్ డివిజన్ పార్లమెంట్ ఎన్నికల సమావేశం చిలుకనగర్ రోడ్డులో ఓ ప్రైవేట్ హాల్‌లో నిర్వహించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్‌లు హాజరయ్యారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మేడ్చల్: మండలంలోని నూతన్‌కల్ గ్రామ చెరువులో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మస్కూరి నవీన్ (37) మృతదేహాన్ని ఆదివారం ఉదయం గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి బంధువులకు అప్పగించారు. నవీన్ మతి స్థిమితం లేకపోవడంతో మూడు నెలలుగా ఆసుపత్రిలో చికిత్స పొందాడు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి చెరువులో శవమై తేలాడు. మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పూలమాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశాన్ని అన్ని రంగాల్లో మొదటిస్థానంలో నిలపాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో దాసు, అశోక్‌గౌడ్, నర్సింగ్‌రావు, నారాయణ, శ్రీనివాస్, రాజేశ్‌కుమార్, వెంకటేశ్వరరావు, సత్యం, కల్యాణ్, రాజు, అంజయ్య పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు



కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని ఆర్ఎల్‌నగర్ ప్రధాన రహదారిపై శనివారం అర్ధరాత్రి కారు బీభత్సం సృష్టించింది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం .. నాగారం నుంచి రాంపల్లి వైపు వస్తున్న ఇకో స్పోర్ట్స్ కారు (టీఎస్06 ఈఈ 2885) వేగంగా వచ్చి ఆర్ఎల్‌నగర్ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. కారులో ఉన్న కార్తీక్ భరద్వాజ్, కౌశిక్ భరద్వాజ్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్రేన్ సహాయంతో ఆదివారం ఉదయం కారును బయటకుతీశారు. విద్యుత్ అధికారులు నూతన స్తంభాన్ని ఏర్పాటుచేసి సరఫరాను పున:రుద్ధరించారు. కాగా ప్రమాదానికి అతివేగం కారణమా..? లేక మద్యం తాగి కారు నడపడం వల్లే ప్రమాదం జరిగిందా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు హనుమాన్ జన్మోత్సవ్ బైక్ ర్యాలీ

కాచిగూడ: హనుమాన్ జన్మోత్సవ్ సందర్భంగా భజరంగ్ సేన ఆధ్వర్యంలో ఈ నెల 23న హనుమాన్ వ్యాయామశాల నుంచి తాడ్‌బన్ హనుమాన్ మందిర్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నట్లు భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు తెలిపారు. ఆదివారం కాచిగూడలోని భజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో అడ్వయిజర్ వినయ్ తివారితో కలిసి ఆయన బైక్ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరించారు. ఉదయం పది గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని, ర్యాలీ అనంతరం మహాహారతి ఉంటుందని తెలిపారు. హిందూ బంధువులందరూ అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సునీల్ అగర్వాల్, మనోజ్ అభియాన్, రవి, రమేశ్వర్, వీరేందర్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657